



రైతు దీక్షలో మాట్లాడుతున్న సబితాఇంద్రారెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు

ఒరగబెట్టిందేమీ లేదు

» మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

నవాబుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 14 నెలల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఒరగబెట్టిందేమీ లేదని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన రైతు దీక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగకపోయినా వంద శాతం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. రైతులు అధైర్యపడొద్దని వారికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కొడంగల్‌లో రైతుల పక్షాన నిలబడిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని రాజకీయ కక్షతో అక్రమ కేసులతో జైలుకు పంపించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల ఘటనలో 45 మంది అమాయక రైతులపై కేసులు పెట్టి జైలుకు పంపించించారన్నారు. కార్యక్రమంలో విద్యా మౌలిక వసతుల మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, శుభప్రద్‌పటేల్, విజయ్‌కుమార్, కొంపల్లి అనంత్‌రెడ్డి, ఆంజనేయులు, దయాకర్‌రెడ్డి, సయ్యద్‌గౌడ్, పట్లోళ్ల భరత్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, గయాజ్, శాంతికుమార్, సంతోష్, విజయ్‌కుమార్, పురుషోత్తం చారి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి

» జిల్లా విద్యాధికారి విజయకుమారి



రిజిస్టర్లను పరిశీలిస్తున్న విజయకుమారి

కీసర, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఉతీర్ణత శాతం పెరగాలని, దానికి తగిన ప్రణాళిక రూపొందించాలని జిల్లా విద్యాధికారి విజయకుమారి ఉపాధ్యాయులకు తెలిపారు. ఆమె బుధవారం తిమ్మాయిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో ముచ్చటించి, వారి పఠనా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల తరగతి బోధనను పరిశీలించారు.

గత ఎన్నికల్లో బీసీల గెలుపు శాతాలు (జిల్లాల వారీగా)

	రంగారెడ్డి	వికారాబాద్	మేడ్చల్
పంచాయతీలు	35	40	36
ఎంపీటీసీలు	41.1	37	27
జెడ్పీటీసీలు	33.33	22	20



'స్థానికం'లో

బీసీ చైతన్యం

బీసీ జనాభా లెక్కలు తేలడంతో రిజర్వేషన్ల అమలుపై ఆ వర్గాల నుంచి డిమాండ్ పెరుగుతోంది. ఇటీవల జరిగిన కులగణనకు సంబంధించి సర్వే నివేదికను మంగళవారం ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీంతో వచ్చే స్థానిక ఎన్నికల్లో బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు అమలు చేయాలని లేనిపక్షంలో కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గడిచిన 2019లో జరిగిన స్థానిక ఎన్నికల్లో బీసీలు రిజర్వుడు స్థానాలకు మించి సీట్లు దక్కించుకున్నారు. రాజకీయ చైతన్యంతో అనేక జనరల్ స్థానాల్లో పోటీ చేసి ఉన్నతవర్గాలను ఢీకొట్టారు. ప్రధానంగా పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటారు. కొన్ని మండలాల్లో రిజర్వేషన్లకు మించి రెట్టింపు స్థాయిలో పంచాయతీలను కైవసం చేసుకోవడం గమనార్హం. అయితే జనాభా శాతం ఉన్న స్థాయిలో సీట్లు సంపాదించలేకపోతున్నారు.

జనరల్ స్థానాల్లోనూ గట్టిపోటీ

- గత ఎన్నికల్లో రిజర్వ్‌డ్ సీట్లకు మించి గెలుపు
- పంచాయతీల్లోనూ కొనసాగిన హవా
- గతంలో 22 శాతంలోపే రిజర్వేషన్లు అమలు
- 42శాతం అమలుకు బీసీ సంఘాల డిమాండ్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): బీసీ రిజర్వేషన్ల కోటాను చట్టబద్ధంగా పెంచేందుకు అనేక చిక్కుముడులు ఉండడంతో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. ఈ విషయంపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'బీసీ రిజర్వేషన్ల పెంపు జరగాలంటే రాజ్యాంగ సవరణ జరగాలి.. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ 42శాతం సీట్లు బీసీలకు ఇస్తామని' ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో అసలు స్థానిక సంస్థల్లో బీసీల ప్రాతినిధ్యం ఎంత? అని పరిశీలిస్తే గడిచిన నాలుగు దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లాలో

మిగతా 7వ పేజీలో...

2019 స్థానిక ఎన్నికల్లో బీసీల గెలుపు వివరాలు

	రంగారెడ్డి	వికారాబాద్	మేడ్చల్
పంచాయతీలు	558	565	61
బీసీ రిజర్వ్‌డ్	124	159	16
మొత్తం గెలిచినవి	195	226	22
ఎంపీటీసీలు	267	221	41
బీసీ రిజర్వ్‌డ్	74	53	11
మొత్తం గెలిచినవి	110	82	15
జెడ్పీటీసీ స్థానాలు	21	18	05
బీసీ రిజర్వ్‌డ్	04	03	01
మొత్తం గెలిచినవి	07	04	01



అహ్మద్‌గూడ అటవీ ప్రాంతంలో

మంటలు

కీసర రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అహ్మద్‌గూడలోని అటవీ ప్రాంతంలో బుధవారం మంటలు చెలరేగాయి. దట్టమైన పొగతో పెద్దఎత్తున మంటలు వ్యాపించడంతో సమీప ప్రాంత ప్రజలు ఆందోళన చెందారు. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. ఈ సందర్భంగా కీసర రేంజ్ ఫారెస్ట్ అధికారి విష్ణువర్ధన్‌రావు మాట్లాడుతూ పేపర్ తయారీకి చెట్ల నుంచి కలకపను సేకరిస్తున్నామని, 20రోజులుగా చెట్ల నరికి వేత కొనసాగుతుందన్నారు. కాగితం తయారీకి వినియోగించే కలపను సేకరించగా మిగతా వ్యర్థాలను అక్కడే వదిలేశామన్నారు. ఆకతాయిల చేష్టలతో ఎండిన చెట్లకొమ్మలకు నిప్పంటుకుందన్నారు. దీంతో పెద్దఎత్తున మంటలు చెలరేగినట్లు వెల్లడించారు. ఆ ఆకతాయిలను వెంటనే గుర్తించి, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మరిది హత్యకు వదిన సుపారి

24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

నలుగురు నిందితులకు రిమాండ్

ఇంటి స్థలం, పాత కక్షల నేపథ్యంలోనే దారుణం

7

సామాన్య భక్తులకు పెద్దపీట

24 నుంచి కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు

» ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

» అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు : కలెక్టర్ గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి, పక్కన కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్ద పీట వేయాలని చీఫ్‌విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి సూచించారు. కీసరగుట్ట బ్రహ్మోత్సవాలపై బుధవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26న మహా శివరాత్రిని పురస్కరించుకుని స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలు 24 నుంచి మార్చి 1వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఈ ఉత్సవాలకు సుమారు 7 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా. అవసరమైన నిధులను ముఖ్యమంత్రితో మాట్లాడి తప్పకుండా అందిస్తామన్నారు.

ఆన్‌లైన్‌లో శీఘ్ర దర్శనం టికెట్లు

బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. దర్శనానికి ఏర్పాటు చేసే 6 క్యూలైన్‌లలో మూడు క్యూలైన్‌లను సామాన్య భక్తులకు ఏర్పాటు చేసి వారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆదేశించారు. శీఘ్రదర్శనం, అభిషేకం టికెట్లు ఆన్‌లైన్‌లో కూడా అందుబాటులో ఉంటాయన్నారు. భక్తులకు తాగునీరు, నిత్యావసరాలు కావాల్సిన నీటి సరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారులకు కలెక్టర్ సూచించారు. వాహనాల పార్కింగ్ స్థలంలో అవాంతరాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. కొలను దగ్గర గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. 24 గంటలపాటు అంబులెన్సులతో కూడిన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారిని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసు శాఖ వారు తగిన బందోబస్తు ఏర్పాటు చేసి, అన్ని శాఖల సమన్వయంతో సమీకృత కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని సూచించారు. డీసీపీ పద్మజ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల నిర్వహణలో జిల్లా అధికారులందరూ వారికి కేటాయించిన పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్‌లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్వో హరిప్రియ, కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ, ఆలయ ఈఓ సుధాకర్‌రెడ్డి, పోలీసు అధికారులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నత్తనడకన వరినాట్లు!

అదును దాటినా పూర్తికాని సాగు లక్ష్యం

- చలితో ఏపుగా పెరగని నారుమళ్లు
- సకాలంలో అందని పెట్టుబడి
- అనుకూలించని వాతావరణ పరిస్థితులు
- ఆలస్యంతో దిగుబడిపై ప్రభావం
- జిల్లాలో సాధారణ సాగు 1,22,593 ఎకరాలు
- నేటికి 1.10లక్షల ఎకరాల్లో పూర్తి



గడిసింగాపూర్‌లో చెరువు కింద నాట్లు వేస్తున్న మహిళలు

పరిగి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'అదును ఎరిగి సేద్యం.. పదును ఎరిగి పైరు' అన్నారు. కానీ యాసంగి సాగు జిల్లాలో వెనుకబడింది. ప్రధానంగా వరి సాగుకు ఇప్పటికే అదును దాటిపోయింది. ఇలా ఆలస్యంగా నాట్లు వేస్తే చివరలో పంట దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ సారి ఇప్పటివరకు ఒకటి, రెండు వర్షాలే కురిశాయి. భూగర్భ జలాలు సైతం రోజురోజుకు తగ్గిపోతున్నాయి. చెరువుల కింద, బోరుబావుల ద్వారా ఉన్న నీటి వనరులతో సరైనా సమయంలో నాట్లు పూర్తి కాలేదు. కలిసిరాని గత వానాకాలం(ఖరీఫ్) కన్నీళ్లు మిగిల్చింది. సీజన్ మధ్యలో కురిసిన వర్షాలు చివరలో కానరాకుండా పోయాయి. భూగర్భ జలాల సమస్య కారణంగా ఈ సారి ముందస్తుగా యాసంగి సాగు అవుతుందని భావించినా, క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా ఉంది.

ఇంకా కొనసాగుతున్న నాట్లు

యాసంగిలో జిల్లాలో అన్ని పంటలు కలిపి 1,22,593 ఎకరాల్లో సాధారణ సాగు ఉంటుందని అంచనా. ఇప్పటి వరకు 1.10 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ఇప్పటి యాసంగిలో అన్ని రకాల పంటలు సాగు పూర్తయింది. కానీ వరిసాగు మాత్రం అలస్యమైంది. యాసంగిలో 71,628 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 50 వేల ఎకరాల్లో

మిగతా 8వ పేజీలో...



రంగంపల్లిలో నారుమడి ఇలా

యాసంగిలో ఇప్పటివరకు సాగు (ఎకరాల్లో)

వరి	50,000
వేరుశనగ	16,308
శనగలు	14,344
చిరుధాన్యాలు	10,000
ఇతర పంటలు	10,000

చలివల్ల నారు పెరగలేదు



ఈ సారి వరినాట్లు వేయడం అలస్యమైంది. చలిగాలుల తీవ్రత వల్ల నారు సరిగ్గా పెరగలేదు. ఆలస్యం కావడంతో దిగుబడి తగ్గే అవకాశం ఉంది. పెట్టుబడి లేక ఇబ్బందులు పడ్డాం. రైతు భరోసా రాలేదు. సకాలంలో పంటరుణాలు ఇవ్వలేదు. అయితే ఆలస్యం వల్ల కోత సమయంలో వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉంది.

-కాకి కృష్ణ, రైతు, మిట్టకోడూరు, పరిగి మండలం

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

» కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కీసర రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా హుస్సేన్ సాగర్‌లో భారత్‌మాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాహారతి కార్యక్రమంలో మృతి చెందిన సిలివేరి అజయ్ కుటుంబాన్ని బుధవారం నాగారం మున్సిపాలిటీలోని తమ ఇంటి వద్ద పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజయ్ మృతి బాధాకరమన్నారు. ఆయన తండ్రి జానకీరాం సెంట్రింగ్ బాక్స్‌లు అద్దెకు ఇస్తూ జవనోపాధి పొందుతూ పిల్లలకు ఉన్నత విద్యనందించారన్నారు. చేతికొచ్చిన కొడుకు లేని లోటును ఎవరూ తీర్చలేరన్నారు. నిస్సహాయ స్థితిలో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. జానకిరాం రెండో కుమారునికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు కూతురు విద్యకయ్యే ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, బీజేపీ నాయకులు విక్రమ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా తాగడానికి చుక్క నీరు లేదంటూ పలువురు మహిళలు పంచాయతీ భవనం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ ఘటన బుధవారం శ్రీరంగవరం పంచాయతీ కార్యాలయం ఎదుట జరిగింది. శ్రీరంగవరం పంచాయతీకి అనుబంధంగా ఉన్న కుమ్మరికుంట గ్రామంలో రెండు నెలలుగా నల్లాల ద్వారా నీటి సరఫరా చేయకపోవడంతో సమీపంలోని వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవటం లేదని, గ్రామ ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించక పోతే ప్రతీరోజు ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

పగలు వేడి రాత్రి చలి

తాండూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పగలు ఎండ, రాత్రి చలి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉదయం వేళ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతుండటంతో జనం బయటికి రావడానికి జంకుతున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. అలాగే సాయంత్రమయ్యే సరికి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోతున్నాయి. దీంతో చలికి గజగజ వణుకుతున్నారు. తాండూరు ప్రాంతంలో నాపరాయి నిక్షేపాలు అధికంగా ఉండటంతో ఇక్కడ ప్రతిసారీ ఎండ అధికంగా ఉంటుంది. బుధవారం కనిష్టం 19, గరిష్టం 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఫిబ్రవరి ప్రారంభంలోనే ఎండలు అధికంగా ఉంటే మేలో ఎండ తీవ్రత పెరుగుతుందని అంచనా.



సమావేశంలో మాట్లాడుతున్న లింగ్యానాయక్

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తాం

» అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి పేదవాడికి ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసకుంటామని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. బుధవారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, విధి విధానాలపై హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్, చీఫ్ ఇంజనీర్ చైతన్యకుమార్‌తో కలిసి హౌసింగ్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లకు పలు సూచనలు సలహాలు చేశారు. హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్ మాట్లాడుతూఇళ్ల మంజూరులో పారదర్శకంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా ఇళ్ల కోసం 2,57,664 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో 2,46,479 దరఖాస్తులను పరిశీలనకు చర్యలు తీసుకున్నామన్నారు. సర్వే పనులు పూర్తి దశకు చేరుకున్నాయని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలకు మండలానికి ఒక గ్రామం చొప్పున ఎంపిక చేసినట్లు తెలిపారు. దరఖాస్తులు పరిశీలనలో తప్పులు దొర్లితే మళ్లీ పరిశీలిస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

- ఆక్రమణదారుల చెర నుంచి భూదాన్ భూమిని కాపాడండి
- మూడో రోజూ రైతుల ఆందోళన
- మద్దతు తెలిపిన బీజేపీ నాయకులు, న్యాయవాదులు


నందిగామలో ఆందోళన చేస్తున్న భూదాన్ బాధిత రైతులు

నందిగామ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మా భూములను మాకు ఇప్పించండి అంటూ 1975లో భూదాన్ భూమి పట్టాపొందిన రైతులు ఆందోళనకు దిగారు. నందిగామ మండలకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మూడో రోజైన బుధవారం కూడా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భూమి కోసం, భుక్తికోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపడం కోసం నాడు ఆచార్య వినోబాభావే భూదానోద్యమాన్ని ప్రారంభించి పేద లకు భూదాన్ భూములు ఇచ్చేలా ఉద్యమం చేశారని రైతులు తెలిపారు. తమకు భూదాన్ బోర్డు కింద అందించిన భూములను కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జా చేశారని ఆరోపిస్తున్నారు. అప్పటి నుంచి అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆందోళనకు బీజేపీ నాయకులు, న్యాయవాదులు మద్దతు తెలిపారు. రైతులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేపల్లి అశోక్ గౌడ్, లక్ష్మణ్, చెన్నయ్య, మల్లేష్, ప్రవీణ్‌గౌడ్, హేమంత్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీకాంత్, చిన్నా న్యాయవాదులు అంజు యాదవ్, సంగమేశ్వర్ రైతులు శ్రీను, వెంకటయ్య, బొంగుపల్లి జంగయ్య, పోచయ్య, యాదమ్మ, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో ఎదుట జాతీయ రహదారిపై ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ నాయకులు ఎంపీ నరేష్, నర్సింగ్ రావు, రమేష్, నర్సింహులు, ఎండీ అలీం, ఖాజ, దేవేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మార్పీఎస్ నేతలతో కలిసి డప్పు కొడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

దరువేసిన ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈనెల 7న హైదరాబాద్‌లో జరగనున్న వేల గొంతుల లక్ష డప్పుల ప్రదర్శన కార్యక్రమం వాయిదా వేసినప్పటికీ బుధవారం కార్యక్రమం చేపట్టారు. అంతకు ముందు అంబేడ్కర్, పూలే, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. అయితే ర్యాలీలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య డప్పు కొట్టి దరువు వేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నేతలు విమర్శలు మానుకోవాలి

చిత్తశుద్ధి ఉంటే గ్యారెంటీలు అమలు చేయండి

బీజేపీ రాష్ట్ర నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి


కొత్తూర్‌లో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కొత్తూర్, ఫిబ్రవరి 5: (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న విమర్శలు మానుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బీజేపీ స్థానిక అధ్యక్షుడు అత్తాపురం మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రాష్ట్రాలకు సమానంగా పంచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బావండ్ల మాణిక్యం, ప్రతాప్‌రెడ్డి, మోహన్‌సింగ్, ఇస్నాతి శ్రీనివాస్, హరికృష్ణ, బాల్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, పాండురంగారెడ్డి, మధుసూదన్, పోచయ్య, రాఘవేందర్‌గుప్తా, శివకుమార్, జంగయ్య, మురళీ, శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో దేశాభివృద్ధి

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్

నందిగామ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్‌గౌడ్ అన్నారు. బుధవారం నందిగామ మండలకేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు అరవింద్ ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. బడ్జెట్‌లో మధ్య తరగతి కుటుంబాలకు ఊరట కలిగిస్తూ వార్షిక ఆదాయం రూ. 12.75 లక్షలకు పెంచడం, వ్యవసాయానికి రూ. 1.45 లక్షల కోట్లు, ముద్ర లోన్‌ల పెంపుతో పాటు ఇతర అన్ని రంగాలకు బడ్జెట్ కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు దేపల్లి అశోక్ గౌడ్, లక్ష్మణ్, చెన్నయ్య, మల్లేష్ ప్రవీణ్‌గౌడ్, హేమంత్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, శ్రీకాంత్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తే సహించం

ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు జయచంద్ర



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అనేక సంవత్సరాల పాటు పోరాడి ప్రాణాలు పణంగా పెట్టి సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నదని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు కల్లూరి జయచంద్ర విమర్శించారు. బుధవారం దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా వివిధ కార్మిక సంఘాల నేతలు ఘట్‌కేసర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నందుననే కార్మికలోకం ఆందోళన చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని నిరసనలు తెలుపుతుంటే స్పందించక పోగా రైతులపై ఉక్కుపాదం మోపుతుందన్నారు. అనేక మంది అన్నదాతల ప్రాణాలను పొట్టనబెట్టుకుందని అన్నారు. రానున్న రోజుల్లో కార్మికులు, కర్షకులు ప్రత్యక్ష పోరాటాలకు సన్నద్ధమవుతున్నారని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాంచందర్, మురళి, సువర్ణ, అండాలు, అరుణ, జంగమ్మ, సబిత, రాంకుమార్, కృష్ణ, ధర్మేంద్ర, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రాకు యాత్రికులు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఉమ్రా యాత్రకు యాత్రికులు బయలుదేరి వెళ్లారు. బుధవారం అల్‌మిజన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో 50 మంది యాత్రికులు వెళ్లారు. ఎయిర్‌పోర్టులో వారికి కుటుంబ సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ ప్రతి ముస్లిం సోదరి, సోదరీమణులు జీవితంలో ఒక్కసారైన ఉమ్రా యాత్ర చేయాలని సూచించారు. ఈ యాత్ర 15 రోజుల పాటు మక్కా, మదీనాలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తామన్నారు. రెండో యాత్ర ఈ నెల 17న ఉంటోందని తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



ఎయిర్‌పోర్టులో యాత్రికులకు వీడ్కోలు పలుకుతున్న కుటుంబ సభ్యులు


మాట్లాడుతున్న పానుగంటి పర్వతాలు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

» ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక కోడల్‌లతో పాటు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని, అధిక ధరలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు జగదీష్, నాయకులు యాదగిరి, నర్సింహ్మా, దత్తు నాయక్, చందు, మల్లేష్, వి. సత్యనారాయణ, నర్సింహ్మారెడ్డి, హరిసింగ్ నాయక్, డి.ప్రసాద్, కేతరాజు, రాములుగౌడ్, పి. యాదయ్య, జె.అంజయ్య, ఎస్.లక్ష్మయ్య, కె. లక్ష్మి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు చంద్రయ్య

బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం

కొడంగల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బుస్స చంద్రయ్య అన్నారు. బుధవారం కొడంగల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని ఆరోపించారు. కష్ట జీవులు, పేద ప్రజలకు వ్యతిరేకంగా బడ్జెట్ ఉందన్నారు. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేటీకరణకు పెద్ద పీట వేయాలని చూస్తుందని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మైసప్ప, అనంతయ్య, మంగమ్మ, వెంకటమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

జిల్లా నూతన అధ్యక్షుడిని కలిసిన నేతలు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మేడ్చల్ మల్కాజ్గిరి రూరల్ జిల్లా నూతన అధ్యక్ష పదవి చేపట్టిన శ్రీనివాస్‌ను బుధవారం మేడ్చల్ నాయకులు మర్యాద పూరకంగా కలిశారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షురాలు జెశైలజ హరినాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌరారం జగన్ గౌడ్ ఆధ్వర్యంలో ఉమ్మడి మేడ్చల్ మండలానికి చెందిన నాయకులు కలిశారు. కార్యక్రమంలో నాయకులు జాకట ప్రేమ్ దాస్, వంశీ విజై, లవంగ శ్రీకాంత్, శ్రీశైలయం దావ్, రాగం అర్జున్, వంశీరెడ్డి మైసరి రాజు, తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

కందుకూరు,ఫిబ్రవరి 5,(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో తహసీల్దారు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో కలిసి ఆయన సమావేశమయ్యారు. ఆయ గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ స్థానాల్లో ఓటర్ లీస్టులు తయారు చేసుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌లలో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. పోలింగ్ సిబ్బందికి గుర్తింపు కార్డులు, శిక్షణ తరగతులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు గోపాల్, సైదులు, నాగార్జున, కేఎల్ఎన్ ఆధిత్య, లలిత, ఎంపీడీవోలు సరిత, ఎంపీవో గీత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్‌డీవో బాల్‌రాజ్

మహిళా సంఘాలు బలోపేతం కావాలి

కందుకూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గ్రామాలలో మహిళా సంఘాలు మరింత బలోపేతం కావాలని, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ బాల్‌రాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కవిత అధ్యక్షతన నిర్వహించిన సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు లింకేజీ, సీఐఎఫ్, న్యూ ఎంటర్‌ప్రైజెస్‌కు రుణాలు మంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం నేదునూరు కెనరా బ్యాంకు మేనేజర్ రాధాకృష్ణ మాట్లాడుతూ తమ బ్రాంచ్ నుంచి సీఎస్ఆర్ రూ.76,500 విలువగల ప్రొజెక్టర్‌ను మండల సమాఖ్యకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం కవి, ఏజీఎం అక్షయకుమారి, సీసీలు యాదయ్య, శ్రీహరి, శ్రీలత, ధనలక్ష్మి, హైమావతి, చంద రాజేశ్వరి, మల్లేష్ పాల్గొన్నారు.

ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

» ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎల్బీనగర్ సితార హోటల్ సెల్లార్ తవ్వకాల్లో ముగ్గురు కార్మికులు మృతి చెందడం బాధాకరమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య అన్నారు. మృతి చెందిన ఒక్కో కార్మిక కుటుంబానికి రూ. 50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ యాజమాన్యాలు కార్మికుల సంక్షేమ చట్టాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ ఘటనకు జిల్లా జేసీఎల్, డీసీఎల్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. ప్రమాదానికి కారకులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

‘స్థానికం’లో బీసీ చైతన్యం

(ఐదో పేజీ తరువాయి)

బీసీలు రాజకీయంగా కొంత చైతన్యం సాధించారు. గతంలో టీడీపీ హయంలో బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించడంతో బీసీ నాయకత్వం రాజకీయంగా ఎదిగింది. మాజీ హోంమంత్రి దేవేందర్ గౌడ్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ తదితర బీసీ నేతలు స్థానిక సంస్థల్లో దక్కిన అవకాశాలను అందిపుచ్చుకుని రాజకీయంగా ఉన్నత స్థానాలకు ఎదిగారు. బీసీలకు అధికారికంగా రిజర్వేషన్లు పెంచితే ఉమ్మడి జిల్లాలో బీసీ నేతలకు మరిన్ని రాజకీయ అవకాశాలు దక్కుతాయి.

గత 2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 22శాతం లోపుగానే రిజర్వేషన్లు అమలు చేశారు. వారికి చట్టపరంగా దక్కాల్సిన అవకాశాలు దక్కనప్పటికీ సామాజిక బలంతో జనరల్ స్థానాల్లో పోటీ చేసి అనేక చోట్ల గెలుపొందారు. రంగారెడ్డి జిల్లాలోని పంచాయతీల్లో దాదాపు 35శాతం, ఎంపీటీసీ స్థానాల్లో 41.1 శాతం, జెడ్పీటీసీ స్థానాల్లో 33.33 శాతం బీసీలు గెలుపొందారు. అలాగే వికారాబాద్ జిల్లాలో పంచాయతీల్లో దాదాపు 40శాతం, ఎంపీటీసీ స్థానాల్లో 37 శాతం, జెడ్పీటీసీ స్థానాల్లో 22 శాతం బీసీలు గెలుపొందారు. మేడ్చల్ జిల్లాలో పంచాయతీల్లో దాదాపు 36శాతం, ఎంపీటీసీ స్థానాల్లో 27 శాతం గెలుపొందారు. ఇక్కడ బీసీలకు కేటాయించిన ఒక్క జెడ్పీటీసీ స్థానంలో మాత్రమే గెలుపొందారు.

బీసీ రిజర్వేషన్ల నేపథ్యం ఇలా..

1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తొలిసారిగా బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమల్లోకి తెచ్చారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో 20శాతం బీసీలకు రిజర్వేషన్లు కేటాయించారు. తర్వాత బీసీ సంఘాలు దీనిపై ఉద్యమించడంతో 1993లో అప్పటి సీఎం కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్థానిక సంస్థల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లు అమల్లోకి తెచ్చారు. అయితే సుప్రీం కోర్టు మొత్తం రిజర్వేషన్లు 50శాతం దాటకూడదని పరిమితి విధించడంతో 2019లో బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 22శాతానికి కుదించి ఎన్నికలు నిర్వహించింది. దీంతో 2019 నుంచి ఉమ్మడి జిల్లాలో ఎదుగుతున్న బీసీ నాయకత్వానికి కొంత బ్రేక్ పడింది. బీసీలకు స్థానిక సంస్థల్లో రాజకీయ అవకాశాలు తగ్గిపోయాయి. మరో వైపు రాష్ట్ర వ్యాప్తంగా కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రస్తుత విధానం వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుందని స్థానిక ఎన్నికల్లో బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని బీసీ సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చింది. అధికారం పగ్గాలు చేపట్టిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా కులగణన సర్వే చేపట్టింది. ఈ నివేదికను మంగళవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. అయితే సుప్రీం కోర్టు ఆదేశాలపై ఏం చేయాలనే దానిపై ఇంకా తర్జనభర్జనలు పడుతూనే ఉంది. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక ఎన్నికల్లో తమ పార్టీ నుంచి బీసీలకు 42శాతం సీట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

మరిది హత్యకు వదిన సుపారి

24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

» నలుగురు నిందితులకు రిమాండ్

» ఇంటి స్థలం, పాత కక్షల నేపథ్యంలో దారుణం

» తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

బషీరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నవాల్గ గ్రామ శివారులో జరిగిన హత్య కేసును పోలీసులు 24 గంటల వ్యవధిలో ఛేదించారు. ఇంటి స్థలం, పాత కక్షల నేపథ్యంలో మరిదిని వదిన దారుణంగా హత్య చేయించిందని నిర్ధారించారు. ఈ మేరకు బుధవారం రాత్రి తాండూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి వివరాలు వెల్లడించారు.

నవాల్గకు చెందిన మాల శామప్ప(31)కు తన సొంత అన్న నర్సింహులు, వదిన సుగుణమ్మతో ఇంటి స్థలం విషయంలో కొంతకాలంగా తరుచూ గొడవలు జరిగుతుండేవి. పలుమార్లు గ్రామ పెద్దలు పంచాయితీ చేసినా గానీ కక్షలు పెరిగాయి తప్ప తగ్గలేదు. దీంతో వదిన ఎలాగైనా మరిదిని అడ్డు తొలగించుకుంటే సమస్య తీరిపోతుందని భావించింది. అనుకున్నట్లుగానే అతడి హత్యకు ప్లాన్ వేసింది. స్థానికంగా ఉంటున్న యువకులైన మాల శివకుమార్, కొత్త విజయకాంత్, విశ్వనాథ్‌లతో రూ. 50 వేలకు సుపారి మాట్లాడింది. ముందస్తుగా రూ.10 వేలు ఇచ్చింది. అయితే సోమవారం రాత్రి ఈ ముగ్గురు.. శామప్పను ప్లాన్ ప్రకారం మద్యం తాగుదామని గ్రామ శివారులోని రాథోడ్‌మోహన్ పొలానికి తీసుకెళ్లారు. శామప్ప మందు తాగుతున్న క్రమంలో ముఖంపై ముగ్గురు పడిగుద్దుల వర్షం కురిపించారు. ఆపై వెంట తెచ్చిన కండువాను మెడకు చుట్టి గొంతు నులిమి హత్య చేశారు. ఆతర్వాత రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం చేశారు. కుదరకపోవడంతో మృతదేహాన్ని వదిలివెళ్లిపోయారు. మంగళవారం ఉదయం డేడ్‌బాడీని స్థానికులు గమనించి అతని తల్లి, చెల్లెలికి తెలిపారు. ఆపై పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో రూరల్ సీఐ నగేష్, ఎస్ఐ శంకర్, క్రైమ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తమదైన శైలిలో విచారించి 24 గంటలలోనే కేసును ఛేదించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు సుగుణమ్మ పోలీసులు బుధవారం సాయంత్రం తాండూరు కోర్టులో హాజరుపర్చారు. ముగ్గురు యువకులను పరిగికి, మహిళను చర్లపల్లి జైలుకు మెజిస్ట్రేట్ రిమాండ్‌క పంపించారని డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ నగేష్, బషీరాబాద్ ఎస్ఐ పి.శంకర్, క్రైం పోలీసులను డీఎస్పీ అభినందిస్తూ నగదు రివార్డును అందజేశారు.


విలేకరుల ఎదుట నిందితులను ప్రవేశపెట్టిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి


ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న కమిటీ సభ్యులు

నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం

» ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

కీసర, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్య అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ (జేహెచ్‌ఈఏ) కార్యాలయంలో జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశంలో జూబ్లీహిల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ మేనేజింగ్ కమిటీ గౌరవ సభ్యులుగా ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, విల్లామేరీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ జాయింట్ సెక్రటరీగా చదలవాడ శ్రీనివాస్‌రావులను ఎన్నుకున్నారు. సొసైటీ అధ్యక్షుడు ఏ. మురళి ముకుంద్, ఉపాధ్యక్షుడు ఆర్. బాలమురళీ కృష్ణ, కార్యదర్శి ఎ. దినకర్ బాబు(ఐఏఎస్) రిటైర్డ్ వీరిద్దరిని కమిటీలోకి ఆహ్వానించారు.

మొరాయించిన సర్వర్

» నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు

» రెండు రోజులుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల పడిగాపులు



పెద్దేముల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తహసీలార్ కార్యాలయంలో రెండు రోజులుగా ధరణి సర్వర్ మొరాయించడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. కూలి పనులు వదులుకొని సైతం పడిగాపులు కాస్తున్నారు. మరోవైపు జోరుగా వరినాట్లు సాగుతున్నాయి. పనులు ముందుకు సాగకపోవడంతో ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. పెద్దేముల్ మండలానికి చెందిన పలు గ్రామాల రైతులు రెండురోజులుగా మార్టిగేజ్ కోసం తిరుగుతున్నారు. కొందరు తాతల పేరిట ఉన్న ఆస్తిని వారి పేరిట చేయించుకునేందుకు విరాసత్ పెట్టుకున్నారు. భూముల క్రయవిక్రయాలు జరిపిన కొందరు రిజిస్ట్రేషన్ల కోసం స్లాట్లు బుక్ చేసుకున్నారు. కానీ ధరణి సర్వర్ రెండు రోజులుగా మొరాయించింది. సర్వర్ డౌన్ కావడంతో రిజిస్ట్రేషన్లు, విరాసత్, మార్టిగేజ్‌వంటి పనులన్నీ నిలిచిపోయాయి. వాటి కోసం పనులు వదులుకుని కార్యాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు రైతులు పడిగాపులు కాస్తున్నారు. అధికారులేమో సర్వర్ పనిచేయనప్పుడు ఏమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు. సుదూర ప్రాంతాలవారు రెండురోజులుగా రవాణా ఖర్చులు భరిస్తున్నారు. చేసేది లేక కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇంకో వైపు పెద్దేముల్ మండలంలో వరినాట్లు జోరుగా సాగుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సర్వర్ మొరాయించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వీధి వ్యాపారులకు మరింత దన్ను

» పీఎం స్వానిధి పెంపు

» రూ. 30వేల పరిమితితో యూపీఐ క్రెడిట్ కార్డులు

» 7,486 మందికి లబ్ధి



తాండూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపారులకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చింది. దీంతో వారికి మరింత సహాయం పెరగనుంది. వీధి వ్యాపారుల చిరు వ్యాపారానికి చేయూతనందించి ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉంది. రెండు రకాలుగా వీధి వ్యాపారులకు లబ్ధి చేకూరనుంది. గతంలో పీఎం స్వా నిధి పథకం ద్వారా పట్టణాల్లోని వీధి వ్యాపారులకు తొలి విడతలో రూ. 10 వేలు వడ్డీ లేని రుణం అందించింది. రెండవ ఏడాది రూ. 20 వేలకు పెంచింది. తాజాగా ప్రస్తుతం బడ్జెట్‌లో రుణ సహాయాన్ని రూ. 30వేలకు పెంచుతున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి ప్రకటించారు. దీంతో మరింత వ్యాపార అభివృద్ధి సాధించవచ్చు. లోన్‌లతో పాటు రూ. 30 వేల పరిమితితో యూపీఐ లింకుడ్ క్రెడిట్ కార్డులను పొందొచ్చని ఆర్థిక శాఖ ప్రకటించడం విదితమే.

స్ట్రీట్ వెండర్స్ వివరాలు

మున్సిపాలిటీ	స్ట్రీట్ వెండర్స్
తాండూరు	3,118
పరిగి	813
కొడంగల్	681
వికారాబాద్	2,874
మొత్తం	7,486

మండల కేంద్రం ఏర్పాటుకు పోరాడుదాం

» జేఏసీ నాయకులు

తలకొండపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటుకు ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం క్యాబినెట్‌లో ఆమోదించిన 11 కొత్త మండలాల జాబితాలో గట్టిప్పలపల్లి పేరు లేకపోతే దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 97వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల వరకు మండల కేంద్రంగా ప్రకటించకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని చెప్పారు. ఆమేరకు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్లు అంజనేయులుగౌడ్, శరత్‌చంద్ర, కార్యదర్శి అనిల్ ఉన్నారు.


ఆచారికి వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 5, (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో తాగునీటి పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం అన్ని గ్రామపంచాయతీల కార్యదర్శులతో కలిసి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీవో సుశీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్‌లో..

మోమిన్‌పేట్: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. తన కార్యాలయంలో బుధవారం ఆమె పంచాయతీ కార్యదర్శులతో కలిసి సమావేశం నిర్వహించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అదే విధంగా ఉపాధిహామీ నర్సరీల్లో మొక్కలను పెంచి రాబోయే వర్షాకాలానికి నాటేందుకు సిద్ధం చేయాలని ఉపాధిహామీ సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో ఎంపీవో యాదగిరి, ఏపీవో శంకరయ్య, పంచాయతీ కార్యదర్శులు నర్సింహులు, సుగుణ పాల్గొన్నారు.

ఆగాఖాన్ ఫౌండేషన్‌కు పునాది ఇక్కడే..

మహేశ్వరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆగాఖాన్ అంతర్జాతీయ విద్యాసంస్థల అధినేత కరీం అల్ హుస్సేనీ ఆగాఖాన్(88) బుధవారం పోర్చుగల్‌లో కన్నుమూశారు. మహేశ్వరం మండలం రావిర్యాల రెవెన్యూ పరిధిలోని 100 ఎకరాల విస్తీర్ణంలో 2006లో అగాఖాన్ ఫౌండేషన్ అంతర్జాతీయ విద్యాసంస్థకు పునాదుల వేశారు. 2010లో 1 నుంచి 12 వ తరగతి వరకు విద్యాసంస్థను ప్రారంభించి అంచెలంచెలుగా అభివృద్ధి చేసి ఎంతో మంది విద్యార్థులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత శిఖరాలకు ఎదిగేలా మార్గనిర్దేశం చేశారు. అలాగే ఆయన ఆలోచన ఆధ్యాత్మిక విశ్వాసం, మానవజాతి గౌరవాన్ని నిలిపే విధి విధానాలవైపు ఎక్కువగా ఉండేవి. ఆయన ప్రపంచంలో అభివృద్ధి చెందని కొన్ని ప్రాంతాలలోని కమ్యూనిటీలకు సేవలందించే విధంగా ప్రపంచంలో అతి పెద్ద ప్రైవేట్ అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ స్థాపించి అనేక మంది పేదలకు అభివృద్ధి, మార్గనిర్దేశం చేసేవారు. అంతే కాకుండా శాంతి, మానవ పురోగతికి రాజనీతిజ్ఞుడుగా, రక్షకుడిగా ప్రపంచవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. ఆయన మృతి పట్ల ఆగాఖాన్ ఫౌండేషన్ దుఃఖసాగరంలో మునిగింది.

డీసీఎంఎస్ దుకాణ సముదాయం ప్రారంభం

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాల్మాకులలో జిల్లా నూతన సహకార మార్కెటింగ్ సొసైటీ దుకాణ సముదాయాన్ని డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. రైతులకు ఏ ప్రభుత్వం ఇవ్వని సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ఇస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మల్కారం పీఎస్‌సీఎస్ చైర్మన్ బుర్కుంట సతీష్, చిన్నగోల్కొండ పీఎస్‌సీఎస్ చైర్మన్ దౌనకర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ నీరటి తన్వీరాజు, మాజీ ఎంపీటీసీలు సరితరవీందర్, ఇందిరకృష్ణాగౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుధీశ్వర్‌గౌడ్, చక్రధర్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనేగౌని శ్రీకాంత్‌గౌడ్, కోటేష్‌గౌడ్, నరసింహ, జుర్కి రమేష్ పటేల్, శబరి, రాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కవులకు ఆహ్వానం


వడిచర్ల సత్యం


కోటం చంద్రశేఖర్

తాండూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాహిత్య అకాడమీ నుంచి తాండూరు కవులకు ఆహ్వానం అందింది. ఈ నెల 8, 9న ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో నిర్వహిస్తున్న సాహిత్య, సంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనాలని కవులు కోటం చంద్రశేఖర్, వడచర్ల సత్యంలను ఆహ్వానించారు. కవులకు ఆహ్వానించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.


మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

» సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. బుధవారం బండంగ్‌పేట్‌లోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన సంస్థ సర్వసభ్య సమావేశంలో బడ్జెట్ అంశాలపై చర్చించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు చేసిన ఖర్చులను ఆమోదించారు. జిల్లా పరిధిలోని మొయినాబాద్, గండిపేట, అబ్దుల్లాపూర్‌మెట్, కడ్తాలలోపాటు పలు ప్రాంతాల్లోని గ్రంథాలయాల భవన నిర్మాణాల కోసం రూ. 10 కోట్లు సంస్థ కేటాయించిందన్నారు. అలాగే కొత్తగా పుస్తకాలు కొనుగోలు చేసేందుకు రూ.50 లక్షలు, కొత్తగా ఫర్నిచర్ కొనుగోలుకు రూ.50 లక్షలు అంచనా వేసినట్లు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల ఖర్చు కింద రూ. 5 లక్షలు కేటాయించేందుకు ఆమోదించారు. కార్యక్రమంలో డీఈఓ సుశీందర్ రావు, డీపీఆర్వో పీసీ వెంకటేశం, వయోజన విద్యాధికారి అనిత, పంచాయతీ అధికారి సాధన, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న గురుకుల ప్రవేశాల దరఖాస్తులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నడుతుపున్న గురుకులాల్లో ప్రవేశాల గడువు గురువారం(నేడు)తో ముగియనున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జోనల్ ఆఫీసర్ నిర్మల, మేడ్చల్ జిల్లా కో-ఆర్డినేటర్ వేణుగోపాల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 5 తరగతి నుంచి 9వ తరగతి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల ప్రవేశాల కోసం నేటి వరకు చివరి తేదీయని ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఈ నెల 23న ఉంటుందని తెలిపారు.

ఎమ్మార్పీఎస్ 'మహా ప్రదర్శన' వాయిదా

కొడంగల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో తలపెట్టిన లక్ష డప్పులు, వేయి గొంతుకలు మహాప్రదర్శన అనివార్య కారణాలతో వాయిదా పడినట్లు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎస్.సోమశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశం నిర్వహించే తేదిని త్వరలోనే ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

నత్తనడకన వరినాట్లు!

(5వ పేజీ తరువాయి)

మాత్రమే సాగు చేశారు. వేరుశనగ 16,308 ఎకరాలు, శనగలు 14,344 ఎకరాలు, చిరుధాన్యాలు 10,000 ఎకరాలు, ఇతర పంటలు అన్ని కలిపి పది వేల ఎకరాల్లో సాగు చేసినట్లు తెలుస్తోంది. వరి సాధారణంగా కంటే ఎక్కువగా సాగు అవుతుందని భావించినా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. కూరగాయలు మాత్రం సాధారణం కంటే ఎక్కువగా సాగు చేసినట్లు సమాచారం. సంక్రాంతి నాటికే వరి నాట్లు పూర్తి కావాల్సి ఉంది. కానీ ఈ సారి సమయం దాటి దాదాపు ఇరవై రోజులు కావస్తోంది. అయినా వికారాబాద్ జిల్లాలో పూర్తిస్థాయిలో వరినాట్లు పూర్తి కాలేదు. ఇప్పటికి పరిగి, దోమ, కులకచర్ల,బొంరాసిపేట్, యాలల్, తాండూరు మండలాల్లోని పలు గ్రామాల్లో వరినాట్లు వేసే ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. గతంతో పోలిస్తే ఈసారి చాలా ఆలస్యమైందని రైతులు, అధికార వర్గాలు కూడా అంగీకరిస్తున్నాయి. ఆలస్యం అవుతున్నా వరి సాధారణ సాగు 71,628 ఉండగా 90 వేలకుపైగా సాగవుతుందని అంచనా వేస్తున్నారు.

ఆలస్యానికి కారణమిదే..

యాసంగికి ముందు వర్షాలు కురవలేదు. అలాగేవాతావరణ పరిస్థితులతోపాటు, కొత్త రుణాలు అందకపోవడం, రైతుభరోసా రాక పెట్టుబడుల ప్రభావం కూడా ఉందని రైతులు వాపోతున్నారు. సరిగ్గా నారుమళ్లు పోసే సమయంలోనే తీవ్రమైన చలిగాలులు వీచడంతో నారు సరిగ్గా ఎదగలేదు. దీనికితోడు పెట్టుబడులకు డబ్బులు అందక విత్తనాలు, ఎరువులు సకాలంలో కొనుగోలు చేయలేదు. పోషకాలు అందక చాలా చోట్ల నారు చనిపోయింది. రెండోసారి నారుమళ్లు పోయడమూ ఆలస్యానికి కారణంగా చెప్పొచ్చు.

అదును దాటితే..

వరి సాగు కాలం 120 రోజులు. నారుమళ్లు పోసుకున్న తర్వాత నెలలోపు నాట్లు పడాలి. నాట్లు పడిన 90 రోజుల్లోపు పంట చేతికివస్తుంది. జనవరిలో నారు వేస్తే మార్చి చివరినాటికి పంట కోతకు వస్తుంది. కానీ ఈ సారి ఆ పరిస్థితి లేదు. ఏకంగా నెలరోజులపాటు ఆలస్యం కావడంతో ఏప్రిల్ చివరివారమో, మే మొదటి వారంలోనో పంట చేతికి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ సమయంలో వడగళ్ల వానలు కురిసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. సాధారణంగా ఆ సమయానికి కంటే ముందే పంట నూర్పిళ్ళు పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సైతం సూచిస్తున్నారు. సరైన సమయంలో సాగు చేయకపోవడం వల్ల ఏప్రిల్‌లో ఎండలు మండిపోతాయి. అతిఉష్ణం ఉండడం, నీరందకపోవడం కారణాలతో విత్తనం కుదురుకోకపోవడం, తాలు శాతం పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. దీని వల్ల 10 నుంచి 20 శాతం పంట దిగుబడి తగ్గే అవకాశాలు ఉంటాయని పేర్కొంటున్నారు.



పరిగి మండలం కరియట్లలో..

వరిసాగు పెరిగే అవకాశం ఉంది



యాసంగిలో ఈ పాటికి కలుపుతీత పనులు చేయాల్సి ఉంటుంది. కానీ ఇంకా నాట్లు వేస్తూనే ఉన్నారు. సంక్రాంతి నాటికి వరినాట్లు పూర్తి చేయాలి. పరిస్థితుల కారణంగా ఆలస్యమైంది. ఇలా అయితే చివరలో నీరు అందక ఇబ్బంది పడాల్సి ఉంటుంది. అయినా ఈ సారి యాసంగి సాగు పంటలు ఆశజనకంగానే ఉంది. వరి సాగు ఇంకా పెరిగే అవకాశం ఉంది.

- మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి, వికారాబాద్

బీసీ, ఎస్సీ డిక్లరేషన్ల ఆమోదం చరిత్రాత్మకం

వికారాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం బీసీ, ఎస్సీ డిక్లరేషన్‌ను అసెంబ్లీలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ఆమోదించడం భారత చరిత్రలో ఒక చరిత్రాత్మకమైన విజయమైని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బుధవారం సమగ్ర కుల గణన సర్వే బిల్లు, ఎస్సీవర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం, స్పీకర్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, రాంచందర్‌రెడ్డి, రమేష్, ముత్తహర్ షరీప్, మురళీ, రెడ్యానాయక్, యాదగిరి, జంగయ్య, రత్నం, నాగరాజు, అంజయ్య పాల్గొన్నారు.

తాండూరు: ఒకే రోజు కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలకు క్యాబినెట్‌తో పాటు అసెంబ్లీ ఆమోద ముద్ర వేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ తాండూరు పట్టణ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. అంబేద్కర్ చౌక్‌లో బుధవారం పలు కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రసంగిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరుపున 42శాతం సీట్లు కేటాయించడం సీఎం రేవంత్‌రెడ్డికే సాధ్యమైందని కొనియడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల, రవిగౌడ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బషీరాబాద్: కులగణనతో బీసీలకు సంపూర్ణ న్యాయం చేకూరుతుందని బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు కలాల్ నర్సింహులుగౌడ్ అన్నారు. బషీరాబాద్‌లోని అంబేద్కర్ చౌక్‌లో బుధవారం సీఎం చిత్రపటానికి ఏఎంసీ చైర్మన్, కాంగ్రెస్ శ్రేణులు, బీసీలు పాలాభిషేకం చేశారు.

చౌడాపూర్: బీసీ, ఎస్సీ డిక్లరేషన్ ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ చౌడాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సలీం, వెంకటయ్యగౌడ్, శేఖర్ పాల్గొన్నారు.



వికారాబాద్: సీఎం, స్పీకర్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అర్ధసుధాకర్‌రెడ్డి

పరిగి రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు చట్టసభల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి హనుమంతు ముదిరాజ్ అన్నారు. పరిగిలో బుధవారంమార్కెట్ కమిటీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలసి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, బీసీ సంక్షేమ శాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

యాలాల: బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించడం అభినందనీయమని యాలాల మండల కాంగ్రెస్ పార్టీ బీ-బ్లాక్ అధ్యక్షుడు చెన్నారం అనిల్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం యాలాల మండల కేంద్రంలో గల అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం చెన్నారం అనిల్‌కుమార్, యాలాల మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు అయ్యగార్ల భీమయ, ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు హన్మంతు పాల్గొన్నారు.

కులకచర్ల: టీపీసీసీ పిలుపు మేరకు బుధవారం కులకచర్లలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం అనుమతించడం సంతోషదాయకమన్నారు. అనంతరం డప్పుల దరువు వేశారు. ఈ కార్యక్రమంలో షైపాల్‌రెడ్డి, భరత్ కుమార్, వెంకటయ్యగౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెద్దేముల్: బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలపడంతో పెద్దేముల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, గోపాల్, లొంక నర్సింహులు, రియాజ్, మల్లేశం, డీవై.నర్సింహులు, గోపాలకృష్ణ, నసీర్ తదితరులు పాల్గొన్నారు.

పూడూరు: సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీల ఏ, బీ, సీ, డీ, వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదించడం హర్షించదగ్గ విషయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కద్మూరు ఆనందం అన్నారు. మండలంలోని మన్నెగూడ చౌరస్తాలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కద్మూరు ఆనందం, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీలు సీఎం సవాల్ స్వీకరించాలి

తాండూరు: స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం సీట్లు కేటాయిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొనడం సంతోషకరమని ఈ సవాల్‌ను బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కూడా స్వీకరించాలని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించిన ముఖ్యమంత్రి అట్టి మాటకు కట్టుబడి ఉండటంతో పాటు కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీల రిజర్వేషన్‌ల చట్టబద్ధత కొరకు కృషిచేయాలని అన్నారు. తిరిగి ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి తీర్మానించాలన్నారు.

బీసీ జనాభాను తక్కువ చూపించడం సరికాదు



మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీ జనాభాను తక్కువగా చూపించడం సరికాదని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూర వెంకటయ్య ఆరోపించారు. ఆయన కొడంగల్‌లో బుధవారం ముదిరాజ్ సంఘం నాయకులతో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేలో కోటీ 92 లక్షల జనాభా ఉన్న బీసీలను కోటీ 40లక్షలుగా చూపడంలో అంతార్యమేంటని ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ పార్టీ రాజకీయ కుట్రలో భాగమేనని ఆరోపించారు. ఈ సమావేశంలో సతీశ్ ముదిరాజ్, బాల్‌రాజ్, కిష్టప్ప పాల్గొన్నారు.

తప్పుల తడకగా కులగణన

పరిగి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కులగణన రిపోర్టు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా ఉందని టీజేఏసీ చైర్మన్ ముకుందా నాగేశ్వర్ బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు. కుట్రపూరితంగా బీసీల జనాభా తగ్గించి చూపారని అన్నారు. ఓసీల జనాభాను పెంచి చూపడం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను పరిరక్షించుకుని తమ అల్ప సంఖ్యాక వర్గాలకు న్యాయంచేస్తూ బీసీలకు అన్యాయం చేయడం మంచిది కాదన్నారు.

జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు అమలు చేయాలి

దోమ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బీసీలకు జనాభా ప్రతిపాదికన 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మండల అధ్యక్షుడు గోవర్ధన్ ముదిరాజ్ అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సర్వే కంటే 2024లో లక్షా 60వేలకు పైగా ఎస్సీ జనాభా, 21లక్షల బీసీ జనాభాను తక్కువ చూపిస్తూ అప్పుడు 8శాతం ఉన్న ఓసీ జనాభాను ఇప్పుడు 15శాతం పెంచుతూ 16లక్షల ఓసీ జనాభాను చూపడం సరికాదన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15వ తేదీన జరిగే సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని సేవాలాల్ బంజార సంఘం మండల అధ్యక్షుడు రామవత్ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సేవాలాల్ జయంతి నిర్వాహణకు ప్రభుత్వం రూ.లక్ష మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్మించే డబుల్ బెడ్ రూం ఇళ్లలో గిరిజనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

కొడంగల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. కొడంగల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగలేదన్నారు. ఈనెల 10వ తేదీన కోస్గిలో నిర్వహించే రైతు దీక్షలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొంటారని తెలిపారు. అనంతరం రైతు దీక్ష పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మధుసూదన్‌యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, కోట్లయాదగిరి, మధుసూదన్‌రెడ్డి, రమేశ్‌బాబు, కృష్ణ, కోట్ల మహిపాల్ పాల్గొన్నారు.

దౌల్తాబాద్: 10న కోస్గిలో జరిగే రైతు దీక్షను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చి విస్మరించిందని ఆరోపించారు. రైతు దీక్షకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

దౌల్తాబాద్‌లో నరేందర్‌రెడ్డి పర్యటన

దౌల్తాబాద్ మండలంలోని అల్లాపూర్, గుండాల గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు ఇటీవలే జరిగిన రోడ్డు ప్రమాదాల్లో గాయపడగా పట్నం నరేందర్‌రెడ్డి బుధవారం ఆయా గ్రామాలకు వెళ్లి కార్యకర్తలను పరామర్శించారు. రావుల్‌పల్లిలో బీఆర్ఎస్ కార్యకర్తల మృతి పట్ల సంతాపం తెలిపారు. పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రావుల్‌పల్లి గ్రామంలో పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అదేవిధంగా దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఆశప్ప స్వగృహంలో జరిగిన శివస్వాముల పూజల్లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్నం నరేందర్‌రెడ్డిని శివస్వాములు శాలువాతో సన్మానించారు. అదే విధంగా దౌల్తాబాద్‌లో వివాహాది కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

యువత భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు

మర్పల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని మర్పల్లి ఎస్ఐ సురేశ్ అన్నారు. మండలంలోని బూచన్‌పల్లిలో మంగళవారం రాత్రి జిల్లా పోలీసు కళాజాత బృందం ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, మత్తు పదార్థాలు, రోడ్డు భద్రత, డయల్ 100, 1098, 1930, డ్రగ్స్ తదితర అంశాలపై ఆటాపాటలతో అవగాహన కల్పించారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, గ్రామ అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

పరిగి రూరల్: దొంగతనాలు అరికట్టేందుకు పోలీసులకు గ్రామస్థుల సహకారం అవసరమని పరిగి ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు. పరిగి మండలంలోని రాపోల్ గ్రామంలో బుధవారం నేరాల అరికట్టేందుకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు ఎస్సై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవర్దన్, గ్రామ అధ్యక్షుడు వెంకటేష్, మాజీ సర్పంచ్ జంగయ్య యాదవ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మర్పల్లి ఎస్ఐ సురేశ్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

దుద్యాల: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ యాదగిరి అన్నారు. మండల కేంద్రంలో ఆన్‌లైన్ మోసాలపై బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులను ఫోన్‌లకు దూరంగా ఉంచాలన్నారు. అకౌంట్‌లో నుంచి డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే 1930 నెంబరుకు సమాచారం అందించాలన్నారు.

డాక్టర్ నాగేశ్వరరావుకు సన్మానం



డాక్టర్ నాగేశ్వరరావు సన్మానిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వనాథ్ గౌడ్

తాండూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత, ప్రముఖ డాక్టర్ నాగేశ్వర్‌రావు తాండూరు మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్ సన్మానించారు. బుధవారం హైదరాబాద్ నగరంలోని ఆస్పత్రిలో నాగేశ్వర్‌రావు కలిశారు. ఆయనవెంట నాయకులు సుభాన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

20న 'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలి

వికారాబాద్: కాంగ్రెస్ హామీలు అమలు చేయాలని ఫిబ్రవరి 20న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఝాన్సీ, జిల్లా కార్యదర్శి మహేందర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం నాయకులతో కలిసి కరపత్రాన్ని విడుదల చేశారు.

నేడు ఉచిత కంటివైద్య శిబిరం

పెద్దేముల్: మంబాపూర్‌లో ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో శంకర కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా గురువారం(నేడు) ఉదయం 9గంటలకు కంటివైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్‌పార్టీ ఏబ్లాక్ అధ్యక్షుడు నర్సింహులు తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కులకచర్ల: పదో తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని తహసీల్దార్ మురళీధర్ తెలిపారు. స్థానిక కేజీబీవీలో బుధవారం విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ చేశారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

యాలాల: సంగెంఖుర్దు-సంగమేశ్వర దేవాలయానికి వెళ్లే రోడ్డు మార్గంలో రూ.20లక్షల నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను బుధవారం కాంగ్రెస్ సీనియర్ నాయకులు హన్మంతు పూజలు చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గ్రామాల్లో అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని కొనియాడారు.

మోమిన్‌పేట్: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిరాజుద్దీన్ అన్నారు. టేకులపల్లి అనుబంధ గ్రామం సుద్దొడ్డు తండాలో రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

తాండూరు రూరల్: మల్కాపూర్ గ్రామానికి చెందిన పాతిరెడ్డిపల్లి లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ తాండూరు మండల బీసీసెల్ అధ్యక్షుడు ఆర్.సీ.గౌడ్ బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దు

కోట్‌పల్లి: మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దని ఎంపీడీవో డానియల్ అన్నారు. మండలంలోని బార్వాద్, నాసన్‌పల్లి, ఎన్కెపల్లి జిన్నారం, రాంపూర్, తదితర గ్రామాల్లో బుధవారం వన మహోత్సవాన్ని ఆయన సందర్శించారు.

క్రైం కార్నర్

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

- రూ.1.69లక్షలు స్వాధీనం



ఘట్‌కేసర్ పోలీసుల అదుపులో నిందితులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పేకాటస్థావరంపై పోలీసులు దాడిచేసి ఏడుగురిని అరెస్టు చేశారు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఈడబ్ల్యూఎస్ కాలనీలోని ఓఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న విషయం తెలుసుకున్న పోలీసులు దాడిచేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.లక్షా 69వేలతో పాటు 12 మొబైల్ ఫోన్లు, ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఘట్‌కేసర్‌కు చెందిన పి.రాజు, ఏ.రాంబాబు, ఏ.సుధాకర్, ఏ.బాబు, ఎస్.యశ్వంత్, ఎం.ఆదినారాయణ, ఎస్.మోహన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ తెలిపారు.

సారాయి విక్రయిస్తే కఠిన చర్యలు

బషీరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) సారాయి విక్రయిస్తే కఠిన చర్యలుంటాయని బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ అన్నారు. బషీరాబాద్ ఎక్సైజ్ ఎస్ఐ రవి ఆధ్వర్యంలో సిబ్బంది సారాయి విక్రయిస్తూ పట్టుబడిన వ్యక్తిని బుధవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సారాయి విక్రయిస్తూ పట్టుబడిన వ్యక్తితో సారాయి తయారీ, విక్రయాలు నిలిపివేయాలని, లేదంటే భారీ జరిమానాతో పాటు క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

చెరువులో కొనసాగుతున్న గాలింపు చర్యలు

బొంరాస్‌పేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలం కుదురుమళ్ల గ్రామానికి చెందిన రాజు మంగళవారం బొంరాస్‌పేట్ పెద్ద చెరువులో మద్యం మత్తులో ఈతకు వెళ్లి గల్లంతైన ఘటన విధితమే. కాగా మంగళవారం రాత్రి నుంచి పోలీసులు గజ ఈతగాళ్లతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం కూడా కోట్‌పల్లి నుంచి ఆరుగురు గజ ఈతగాళ్ల సాయంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టినా రాజు ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

మర్పల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్ అన్నారు. మండలంలోని బూచన్‌పల్లిలో బుధవారం ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను విస్మరిస్తే మరో ఉద్యమం

తాండూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తాండూరు నియోజకవర్గ తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం తాండూరు నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు పాల్గొని పలు అంశాలు చర్చించారు. ఉద్యమకారులపై ఇంకా కేసులు కొనసాగుతున్నాయని తెలంగాణ కోసం కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు ఇవ్వాలని ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారు. నామినేటెడ్ పదవులు, 250 గజాల ఇంటిస్థలం ఇచ్చి హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారులు మృతి చెందిన కుటుంబాలకు ఐక్యవేదిక ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో యు.రమేష్ కుమార్, సంజయ్‌గౌడ్, కేశవులు, జిలాని, ఫేరోజ్ ఖాన్, భద్రేశ్వర్ పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలోని 4వ, వార్డుకు చెందిన అర్చ కాలనీలో నెల కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బుధవారం కాలనీ వాసులు మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. కాలనీలో పూర్తి స్థాయిలో సీసీ రోడ్డులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు తెలిపారు. కాలనీలోని అన్ని రోడ్లను అభివృద్ధి పరచటంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీంతో స్పందించిన కమిషనర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో అర్చన సేవాసమితి అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బుచ్చి రాములు, కోషాధికారి మన్మధ రావు, కార్యవర్గ సభ్యులు కమలాకర్ రడ్డి పాల్గొన్నారు.

యాదవ సంఘం కొడంగల్ నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

కొడంగల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో బుధవారం యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్య యాదవ్, నారాయణరావు యాదవ్, రామకృష్ణయాదవ్, యాదగిరి యాదవ్, బస్వరాజ్ యాదవ్, వెంకటేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా ర్యాలపేట మోహన్‌రావు, అధ్యక్షుడిగా బత్తుల నర్సింహులుయాదవ్, ఉపాధ్యక్షుడిగా గొల్ల మొగులప్ప యాదవ్, గొల్ల అంజనేయులుయాదవ్, గొల్ల వెంకట్రాములుయాదవ్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహులు, కార్యదర్శిగా గొల్ల మోహన్‌యాదవ్, అంజనేయులు యాదవ్, గొల్ల చందు యాదవ్, కోశాధికారిగా అంజిలయ్యయాదవ్, గౌరవ సభ్యులుగా గొల్ల కృష్ణ, వెంకటప్ప, సత్యనారాయణయాదవ్, బుగ్గప్పయాదవ్, శేఖర్, మహేశ్‌యాదవ్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాఘవేందర్‌యాదవ్, గోపాల్‌యాదవ్, రఘుయాదవ్, దాసప్పయాదవ్, నారాయణరావు యాదవ్, పకీరప్ప యాదవ్, మోహన్‌రావు, కృష్ణయ్యయాదవ్, నారాయణయాదవ్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల అరెస్టు

పరిగి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సర్పంచుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని సీఎం ఇంటి ముట్టడికి వెల్తున్న మాజీ సర్పంచ్‌లను పరిగిలో పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బుధవారం ఉదయం సీఎం ఇంటి ముట్టడికి వెళ్తున్న సర్పంచ్‌లు రాజేందర్, వెంకటయ్య, జగన్, బాలయ్యలను పోలీసులు అరెస్టుచేసి పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ సర్పంచ్‌లను అరెస్ట్ చేసిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పరిగి మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వారికి మద్దతు తెలిపారు. అరెస్టులతో తమ పోరాటాన్ని ఆపలేరని, పెండింగ్ బిల్లులు విడుదల చేసే వరకు పోరాడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రేపు లగచర్లలో భూ సర్వే

దుద్యాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు కోసం శుక్రవారం(రేపు) లగచర్లలో భూ సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిషన్‌నాయక్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 102, 117, 120, 121 సర్వే నెంబర్‌లలో 110 ఎకరాల 32 గుంటల భూములకు సంబంధించి అసైన్డ్ భూముల సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టాదారులు తమ హద్దులను అధికారులకు చూయించాలని పేర్కొన్నారు.